

తవ్వుకో.. అమ్ముకో..

రెంజల్ మండల పరిధిలో రాత్రివేళల్లో ఇసుకను అక్రమంగా తవ్వుతూ జిల్లాలు దాటిస్తున్నారు. అధికారులు పట్టించుకోవట్లేదు.

- 8లో ▸



సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై అలసత్వం తగదని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
25.9 /23.5

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం ఎండ తీవ్రత ఉండవచ్చు. మధ్యాహ్నం నుంచి మేఘావృతమై చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

డీఎస్ ఆరోగ్య పరిస్థితిపై సర్వత్రా చర్చ



ఖలీల్‌వాడి : మాజీ మంత్రి, మాజీ పీసీసీ అధ్యక్షులు డి శ్రీనివాస్ (డీఎస్) సోమవారం మధ్యాహ్నం తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో జిల్లాలో ఆయన ఆరోగ్యంపై చర్చ జరిగింది. త్వరగా ఆరోగ్యం కుదుటపడాలని డీఎస్ అభిమానులు కోరుకున్నారు. ఆయన తనయుడు ఎంపీ అర్వింద్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో డీఎస్‌ను చేర్పించగా ప్రస్తుతం ఆయన ఆరోగ్యం కుదుటపడినట్లు ఎంపీ పేర్కొన్నారు. డీఎస్ అస్వస్థత కు గురికావడం ఇటీవల ఇది రెండొవసారి. అయితే బీపీ హెచ్చుతగ్గుల్లో వ్యత్యాసం కారణంగా ఆయన ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం.

కార్మికశాఖకు సెస్ చెల్లించాలి

నిజామాబాద్ సిటీ : తెలంగాణ భవనాలు, ఇతర నిర్మాణ సంక్షేమ సెస్ చట్టం 1996 ప్రకారం రూ. 10లక్షలు అంతకన్న ఎక్కువ విలువ గలిగిన భవనాలు, అపార్టుమెంట్లు నిర్మించుకుని సెస్ చెల్లించని వారు కార్మికశాఖకు ఒకశాతం సెస్ చెల్లించాలని కార్మికశాఖ సహాయ కమిషనర్ యోహాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2009 తర్వాత సెస్ చట్ట ప్రకారం ఆ రోజుల్లో ప్లాన్ అప్రూవల్ అథారిటీస్ నుంచి ప్లాన్ అప్రూవల్ తీసుకుని రూ. 10లక్షలు అంతకన్న ఎక్కువ విలువ గలిగిన ఇళ్ల, అపార్టుమెంట్లు, భవన నిర్మాణాలు నిర్మించుకున్నారో వారు వాటికి అయిన ఖర్చు మొత్తంలో ఒక శాతం సెస్ కార్మిక శాఖకు చెల్లించాలన్నారు.

నిజాంసాగర్ రెండు గేట్లు ఎత్తివేత

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టులోకి సోమవారం ఎగువ ప్రాంతాల నుంచి 16 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ఘనపురం ఆనకట్ట ద్వారా 8 వేలు, హల్దీ వాగు ద్వారా 6 వేలు, పోచారం ప్రాజెక్టు ద్వారా 2 వేల క్యూసెక్కుల చొప్పున ఇన్‌ఫ్లో వస్తోందని అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 2 వరద గేట్లను ఎత్తి 15 వేల క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి విడుదల చేస్తున్నామన్నారు.

'దరఖాస్తు చేసుకోండి'

నిజామాబాద్ అర్బన్ : న్యాయపరిపాలనలో ఉచిత శిక్షణ కోసం ఎస్సీ న్యాయవాదులు దరఖాస్తులు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి శశికళ ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్డ్ కులానికి చెందిన ఉమ్మడి జిల్లా అభ్యర్థులకు 8 సీట్లు కేటాయించామన్నారు. అభ్యర్థులు బార్‌కౌన్సిల్‌లో రిజిష్టరై ఉండాలన్నారు. అభ్యర్థి తండ్రి/సంరక్షకుడి సంవత్సర ఆదాయము రూ. 2 లక్షలకు మించరాదన్నారు. శిక్షణకాలంలో అభ్యర్థికి నెలకు రూ. 1,000 స్టైఫండ్ ఇస్తామని, శిక్షణపై ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ దరఖాస్తులను శాఖ ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో ఎంట్రీ చేసి ఆ దరఖాస్తులను కలెక్టరేట్‌లోని షెడ్యూల్డ్ కులా అభివృద్ధి అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు.

13న ఉమ్మడి జిల్లా ఆర్చరీలో ఎంపికలు

నిజామాబాద్‌నాగారం : ఎస్‌జీఎఫ్‌కు సంబంధించి ఉమ్మడి జిల్లా అభ్యర్థులకు ఈనెల 13న ఆర్చరీలో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి సంగీత్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో అండర్ – 14, 17 బాలబాలికల ఎంపికలు ఉంటాయన్నారు. క్రీడాకారులు ఉదయం 10 గంటలకు సర్టిఫికెట్లు, బోనోఫైడ్, కిట్‌తో కోచ్ నర్సింహారెడ్డికి రిపోర్ట్ చేయాలన్నారు.

మట్టి గణనాథులనే పూజించాలి



నిజామాబాద్ సిటీ : రానున్న గణేశ్ ఉత్సవాల్లో భాగంగా మట్టి గణపతులనే పూజించాలని దేవాదాయ ధర్మదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని దేవాదాయ శాఖ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఎస్.సుప్రియకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మట్టితో తయారు చేసిన గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి గణపతులనే పూజిస్తే భవిష్యత్తు తరాలకు మేలు చేసినవాళ్లమవుతామన్నారు. ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో మంత్రి చేతుల మీదుగా మట్టి గణపతులను పంపిణీ చేశామని కమిషనర్ సుప్రియ పేర్కొన్నారు. దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

గంపగుత్తగా దొంగఓట్లు

- బోధన్ పట్టణంలో వివిధ పోలింగ్ బూత్‌లలో ఇష్టారాజ్యం
- ఖాళీ రేకులషెడ్డులో 45 ఓట్లు నమోదు
- ఓ ఇంటి నంబరుపై ఏకంగా 140 ఓట్లు
- పలువురి ఇంటి నంబర్లపై యజమానులకు తెలియకుండానే ఓటర్ల నమోదు
- సరిహద్దు మహారాష్ట్ర గ్రామాల పేరుతో అడ్డగోలుగా చేర్పులు
- అధికార బీఆర్ఎస్ కీలక నాయకుడి డైరెక్షన్‌లోనేనంటున్న విపక్షాలు
- ఆందోళనపథంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల శ్రేణులు

బోధన్ పట్టణంలో దొంగ ఓట్ల నమోదు వ్యవహారం కలకలం సృష్టిస్తోంది. గతంలో బోధన్ పట్టణంలో నకిలీ పాస్‌పోర్టుల వ్యవహారం, నకిలీ చలాన్ల కుంభకోణం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం అందరికీ తెలిసిందే. మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉండడంతో ఈ పట్టణంలో దొంగ ఓట్ల నమోదు విచ్చలవిడిగా చేస్తుండడం తాజాగా గందరగోళానికి దారితీసింది.



బోధన్‌లో సర్వే చేస్తున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : బోధన్ నియోజకవర్గంలో అధికార బీఆర్ఎస్ పార్టీ కీలక నాయకుడి కనుసన్నల్లోనే దొంగఓట్ల నమోదు జరుగుతోందని బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. దొంగఓట్లు జాబితాలో వస్తే ఎన్నికల సంఘం తీసుకునే చర్యలకు కలెక్టర్ బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎంపీ అర్వింద్ ఇటీవలే లేఖ రాశారు. మరోవైపు దొంగ ఓట్లు జాబితాలో చేరిస్తే సహించేది లేదని కాంగ్రెస్ మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. దొంగ ఓట్ల నమోదు వ్యవహారంపై బీజేపీ నాయకుడు మేడపాటి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తున్నారు.

సరిహద్దు ప్రాంతాల నుంచి..

సరిహద్దు మహారాష్ట్రలోని బిలోలి, నర్సి, నాందేడ్, కొండల్‌వాడి, ధర్మాబాద్, ఏజ్లి, సగ్రోలి, గంజ్‌గావ్ తదితర ప్రాంతాలకు చెందిన వారి వద్ద నుంచి ఓ వర్గం వారి ఆధార్ కార్డులు సేకరించారు. ఇందుకు కొంత మొత్తం ముట్టజెప్పడం విశేషం. అదేవిధంగా ఎన్నికల తర్వాత తెలంగాణ ప్రభుత్వ పథకాలు అందిస్తామని చెప్పడం గమనార్హం. ఇలా తెచ్చిన ఆధార్‌లతో కొత్త ఓట్లు నమోదు చేశారు. అయితే బూత్ లెవల్ అధికారులు ఓవర్‌లుక్‌లో అప్రూవ్ చేయడంతో దొంగ ఓట్లు జాబితాలో చేరుతున్నాయి. గత ఎన్నికల్లో సైతం ఇదేవిధంగా ఏకంగా 16,800 దొంగ ఓట్లు చేర్చడంతో ఎన్నికల్లో ఫలితం తారుమారైనట్లు కాంగ్రెస్, బీజేపీ నాయకులు చెబుతున్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత ఈ తతంగం వెలుగుచూడడం గమనార్హం.



బోధన్‌లో ఓటర్‌లిస్ట్ చూపుతున్న సుదర్శన్ రెడ్డి(ఫైల్)

ఆధార్ జిరాక్సుల ఆధారంగా..

బోధన్ నియోజకవర్గం వ్యాప్తంగా తాజాగా 10,870 కొత్త ఓట్ల దరఖాస్తులు రాగా, అందులో ఒక్క బోధన్ పట్టణంలోని రెండుమూడు ప్రాంతాల్లోనే ఏకంగా 6,225 దరఖాస్తులు వచ్చాయి. మిగిలిన నియోజకవర్గం వ్యాప్తంగా కేవలం 4,645 దరఖాస్తులు మాత్రమే ఉన్నాయి. ఇందుకు సంబంధించి ఆశ్చర్యకరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఇటీవల బోధన్‌లో శిక్షణ, జాబ్‌మేళా నిర్వహించారు. ఈ క్రమంలో పలువురి వద్ద నుంచి ఆధార్ జిరాక్స్‌లు తీసుకున్నారు. ఇలా తీసుకున్న ఆధార్ చిరునామాలపై ఆయా ఇళ్ల యజమానులకు తెలియకుండానే కొత్త ఓట్లు పెద్దఎత్తున నమోదు చేయడం గమనార్హం. పట్టణంలోని ఒక ప్రాంతంలో ఒకే ఇంటి నంబరుపై ఏకంగా 140 ఓట్లు నమోదు చేశారు. మరో చోట ఖాళీ రేకుల షెడ్డులో 45 ఓట్లు నమోదు చేశారు. అధికార పార్టీ కీలక నాయకుడు ఈ ప్రక్రియ కోసం ప్రత్యేకంగా ఏజెంట్లను పెట్టుకున్నట్లు సమాచారం.

స్పెషల్ ఆఫీసర్ల ఏర్పాటు చేయాలి

దొంగ ఓట్ల నియంత్రణ కోసం ప్రత్యేకంగా అధికారులను నియమించాలని బీజేపీ నాయకుడు మేడపాటి ప్రకాష్‌రెడ్డి డిమాండ్ చేస్తున్నారు. సర్వే కోసం వచ్చిన టీములపై దాడులు కూడా చేసేందుకు ప్లాన్లు వేసుకుంటున్నారని, పోలీసుల రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. గత ఎన్నికల్లో నాంపల్లి నియోజకవర్గంలో 18,500 ఓట్లు దొంగ ఓట్లుగా తేలడంతో వాటిని రద్దు చేశారు. ప్రస్తుతం బోధన్‌లో దొంగ ఓట్ల బాగోతాన్ని బట్టబయలు చేయడంతో నేరుగా ఆర్డీవో పర్యవేక్షిస్తున్నారు. కాగా తాజాగా ఒక బూత్ పరిధిలో 680 ఓట్ల విషయమై సర్వే చేస్తేనే అందులో కేవలం 16 మాత్రమే ఒరిజినల్ ఓట్లుగా తేలడం విశేషం. మిగిలిన ఓట్లన్నీ నకిలీవే కావడం గమనార్హం. బోధన్‌లో కొత్తగా నమోదు చేసుకున్న వాటిలో 90శాతం పైగా దొంగ ఓట్లే ఉన్నట్లు వెరిఫికేషన్‌లో బయటపడుతుండడం విశేషం. బుధవారం జాబితా ప్రకటిస్తే నకిలీ ఓట్ల వ్యవహారం పూర్తి ముఖచిత్రం బయటకు రానుంది. దాన్ని బట్టి కార్యాచరణకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు సిద్ధమవుతున్నాయి.



బోధన్‌లో ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు(ఫైల్)

ఓటరు నమోదులో వేగం పెంచాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్

సుభాష్‌నగర్ : ఓటరు నమోదు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. రాష్ట్ర సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్, ఇతర రాష్ట్ర స్థాయి అధికారులతో కలిసి రాష్ట్ర శాసనసభకు జరగబోయే సాధారణ ఎన్నికలపై సీఈవో వికాస్‌రాజ్ సోమవారం జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ రాష్ట్రంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ కోసం అర్హులైన ప్రతి ఒక్కరికీ జాబితాలో పేర్లు నమోదు చేసుకునేలా చూడాలని తెలిపారు. గత ఎన్నికల్లో తక్కువ పోలింగ్ శాతం నమోదైన పోలింగ్ స్టేషన్లను గుర్తించి, ఈసారి ఓటర్లకు అవగాహన కల్పించాలని, వందశాతం పోలింగ్ నమోదయ్యేలా కృషి చేయాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసిన వివరాలు, బీఎల్‌ఓల దగ్గర ఉన్న ఓటర్ల జాబితా తప్పనిసరిగా సరిపోల్చుకుని పరిశీలించాలని, ప్రత్యేక శిబిరాల ద్వారా ఎంతశాతం ఓటర్ నమోదు చేశారు. వాటికి సంబంధించిన వివరాలు అన్నీ డాటాలో పొందుపర్చాలని మార్గనిర్దేశం చేశారు. ఈసారి జరగబోయే ఎలక్షన్లలో ప్రతి పోలింగ్ స్టేషన్‌లో వందశాతం పోలింగ్ అయ్యేలా చూడాలని, పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ముఖ్యంగా వికలాంగులు, 80 ఏళ్లు నిండిన వారు, సెక్స్ వర్కర్ల వివరాలు వెబ్‌సైట్‌లో నమోదు చేసి తప్పనిసరిగా మార్కింగ్ వేయాలని, కాలేజీ, పాఠశాలల్లో ఓటర్ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయాలన్నారు. బీఎల్‌వో యాప్, ఓటర్ హెల్ప్‌లైన్ తప్పనిసరిగా ప్రజలకు అర్థమయ్యే రీతిలో చెప్పి ఓటర్ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, నగర పాలక సంస్థ కమిషనర్ ఎం మకరంద్, సంబంధిత ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన శివనామస్మరణ



నగరంలో శ్రావణమాసం చివరి సోమవారం సందర్భంగా నీలకంఠేశ్వరాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- వివరాలు లోపలి పేజీలో..

కాంగ్రెస్ విజయభేరిని సక్సెస్ చేయాలి



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, కేశవవేణు, తాహెర్‌బిన్‌హందాన్

- 17న హైదరాబాద్‌లోని తుక్కుగూడలో..
- నేడు, రేపు జిల్లాలో పార్లమెంట్ ఇన్‌చార్జి బీఎం నాగరాజు పర్యటన
- డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి

ఖలీల్‌వాడి : ఈ నెల 17న హైదరాబాద్‌లోని తుక్కుగూడలో జరిగే కాంగ్రెస్ విజయభేరి సభను విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆఫీస్‌లో ఆయన మాట్లాడారు. ఈ సభకు ముఖ్య అతిథిగా తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీతో పాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరవుతున్నారన్నారు. ఈ సభకు జిల్లాలోని ఒక్కొక్క నియోజకవర్గం నుంచి 10 వేల మందిని జన సమీకరణ చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారు కూడా సమావేశాలు నిర్వహించి సభకు కార్యకర్తలను, నేతలను, ప్రజలను తరలించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక చేయబోయే 5 ముఖ్యమైన హామీలను సభలో ప్రకటిస్తారన్నారు.

జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు బీఎం నాగరాజు రెండు రోజులు జిల్లాలో పర్యటిస్తారన్నారు. ఈనెల 12న ఆర్మూర్ నియోజకవర్గంలోని నందిపేట మండల కేంద్రంలో ఉదయం 11 గంటలకు, అలాగే 13వ తేదీ ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం ఉంటుందన్నారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు రూరల్ నియోజకవర్గంలోని కెఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో సమావేశం ఉంటుందన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కమిటీ సభ్యుడుగా నియమింపబడ్డ టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్ బీన్ హందాన్‌ను సన్మానించారు. జిల్లాలోని కాంగ్రెస్ ఓబీసీ సెల్ మండల అధ్యక్షులకు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షులు కేశవవేణు, రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన జిల్లా అధ్యక్షుడు గంగాధర్ గౌడ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వరదబట్టు వేణు రాజ్, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు రాజా నరేందర్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గంగారెడ్డి, కాంగ్రెస్ మండల నేతలు పాల్గొన్నారు.

తాళాలు పగులగొట్టి.. 'అంగన్‌వాడీ'లు తెరిచి..

- కొందరు సమ్మెలో.. మరికొందరు విధుల్లో..
- దగ్గరుండి తెరిపిస్తున్న అధికారులు
- పట్టణాల్లో మెప్మా సిబ్బందికి.. గ్రామాల్లో జీపీ కార్యదర్శులకు బాధ్యతలు

నిజామాబాద్‌నాగారం/మోర్తాడ్ : జిల్లాలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మెకు దిగారు. ఇందులో సీఐటీయూ అనుబంధంగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సమ్మెలో పాల్గొనగా టీఎన్జీవోస్ అనుబంధంగా ఉన్న టీచర్లు, ఆయాలు విధుల్లో ఉన్నారు. అలాగే మినీ అంగన్‌వాడీ కేంద్రాలు కూడా తెరిచే ఉన్నాయి. మూసిఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను అధికారులే దగ్గరుండి గదుల తాళాలు పగులగొట్టి పట్టణాల్లో మెప్మా సిబ్బందితో, గ్రామాల్లో జీపీ కార్యదర్శులకు విధులు అప్పగించారు. అంగన్‌వాడీల్లో గర్భిణులు, చిన్నారులు, బాలింతలకు ఇబ్బందులు ఉండకుండా చేస్తున్నారు. సమ్మె మొదలైన రోజే ప్రభుత్వం సీరియస్‌గా స్పందించడం గమనార్హం.

కనీస వేతనాల కోసం..

జిల్లావ్యాప్తంగా బోధన్, ఆర్మూర్, డిచ్‌పల్లి, భీమ్‌గల్, నిజామాబాద్ అర్బన్ పరిధిలోని సీఐటీయూ అనుబంధంగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు కేంద్రాలకు తాళాలు వేసీ సమ్మెలోకి వెళ్లారు. సోమవారం నుంచే ఆయా ప్రాజెక్టుల పరిధిలో నిరసనలు చేస్తున్నారు. జిల్లాలో సుమారు 2వేల వరకు టీచర్లు, ఆయాలు సమ్మెలో ఉన్నారు. కనీస వేతనాలు రూ. 26 వేలు, పదవి విరమణ 60 ఏళ్లకు చేయాలని, తదితర బెనిఫిట్స్ కోసం సమ్మెలోకి వెళ్లారు.



నగరంలోని గౌతంనగర్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని తెరిపిస్తున్న అర్బన్ సీడీపీవో సౌందర్య



మోర్తాడ్‌లో..

టీఎన్జీవోస్‌తో అనుబంధం ఉన్నవాళ్లు..

టీఎన్జీవోస్ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో సుమారు 1,000కి పైగా టీచర్లు, ఆయాలు విధుల్లో ఉన్నారు. సమ్మెకు సంబంధం లేకుండా ఎప్పటిలాగే విధులకు హాజరయ్యారు. అలాగే జిల్లాలో ఉన్న 135 మినీ అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. మినీ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న టీచర్లు, ఆయాలందరూ ఎప్పటిలాగే హాజరయ్యారు. దీంతో పాటు డిచ్‌పల్లి ప్రాజెక్టు పరిధిలో కొంతమంది టీచర్లు, ఆయాలు విధులు నిర్వహిస్తున్నారు.

1500 కేంద్రాలు..

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సుమారు 2వేల మందివరకు సమ్మెకు వెళ్లారు. జిల్లావ్యాప్తంగా 1500 కేంద్రాలున్నాయి. డిచ్‌పల్లిలో 303 కేంద్రాలు అన్ని తెరిచే ఉన్నాయి. అలాగే ఆర్మూర్‌లో 220 కేంద్రాల్లో 26 మాత్రమే మూసి ఉన్నాయి. బోధన్ పరిధిలో 164 కేంద్రాల్లో 36 మాత్రమే మూసి ఉన్నాయి. నిజామాబాద్ అర్బన్‌పరిధిలో 191 కేంద్రాలుంటే 40 వరకు మూసి ఉన్నాయి. భీమ్‌గల్ పరిధిలో 75 కేంద్రాలుంటే అన్ని ఓపెన్ చేయించారు. ఐసీడీఎస్ అధికారులు అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టించారు. మెప్మా సిబ్బందితో విధులు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు.

చర్యలు తీసుకుంటున్నాం

జిల్లాలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సమ్మెకు వెళ్లిన విషయం తెలిసిందే. మూసివేసిన కేంద్రాలను ఇప్పటికే తెరిపించాం. సమ్మెతో మాకు సంబంధం లేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపించడానికి చర్యలు తీసుకుంటున్నాం. మంగళవారం నుంచి అన్ని కేంద్రాలు ఓపెన్ చేయించి బాలింతలకు, పిల్లలకు, గర్భిణులకు సేవలందిస్తాం.

– రసూల్‌బీ, పీడీ ఐసీడీఎస్

సమ్మె కొనసాగిస్తాం...

ప్రభుత్వం దిగివచ్చే వరకు మా సమ్మె కొనసాగుతుంది. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం మొండితనంగా వ్యవహరించడం సరైంది కాదు. న్యాయసమ్మతమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలి.

– దేవగంగు, జిల్లా అధ్యక్షులు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్

టెట్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

అదనపు కలెక్టర్ పి యాదిరెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ యాదిరెడ్డి

నిజామాబాద్‌అర్బన్ : ఈనెల 15న నిర్వహించనున్న టెట్ – 2023 (టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్) పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ పి యాదిరెడ్డి అధికారులను ఆదేశించారు. టెట్ రాత పరీక్ష నిర్వహణకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులకు సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఉదయం 9:30 గంటల నుండి 12:00 గంటల వరకు మొదటి సెషన్‌లో జరిగే పేపర్–1 పరీక్షకు జిల్లాలో 15,263 మంది అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా 64 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అలాగే, రెండవ సెషన్‌లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు జరిగే పేపర్–2 పరీక్షకు 11,573 హాజరు కానుండగా, 50 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో గదిలో 24 మంది అభ్యర్థులు పరీక్ష రాసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రశ్నాపత్రాల బుక్ లెట్ తదితర విషయాలపై సందేహాలను నివృత్తి చేశారు. మొదటి సెషన్ కు సంబంధించి ఉదయం 9.00 గంటల్లోపు, రెండవ సెషన్‌కు సంబంధించి మధ్యాహ్నం 2.00 గంటల్లోపు అభ్యర్థులు పరీక్షా కేంద్రాలోకి చేరుకోవాలన్నారు. ఎలాంటి ఎల్రక్టానిక్ వస్తువులు తీసుకురావొద్దని, షూస్ వేసుకోవద్దని చెప్పులతో పరీక్షకు హాజరుకావాలన్నారు. అభ్యర్థులకు సందేహాలుంటే కంట్రోల్ ఫ్రీ : 90302 82993లో సంప్రదించాలన్నారు. సమావేశంలో డీఈవో దుర్గాప్రసాద్, డీఈఈవో రఘురాజ్, పరీక్షల నియంత్రణ విభాగం సహాయ కమిషనర్ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

17న జాతీయ జెండా ఆవిష్కరణ

సుభాష్‌నగర్ : సెప్టెంబర్ 17న తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రాల్లో జాతీయ జెండాను ఎగురవేయాలని సీఎస్ శాంతికుమారి సోమవారం ఉత్తర్వులిచ్చారు. ఈమేరకు జిల్లా కలెక్టర్లకు ఆదేశాలందాయి. జిల్లాలో ఇన్‌చార్జి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి జెండా ఎగురవేయనున్నారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

162 అభ్యంతరాలు

నిజామాబాద్‌అర్బన్: ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలకు సంబంధించి అభ్యంతరాల స్వీకరణ కొనసాగుతోంది. సోమవారం రాత్రి 10 గంటల వరకు 162 అభ్యంతరాలు వచ్చాయి. వీటిని విద్యాశాఖ అధికారులు పరిశీలన చేసి పంపిస్తున్నారు. సోమవారం రాత్రి 12 గంటల వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నారు.

తవ్వుకో.. అమ్ముకో..

- యథేచ్ఛగా కొనసాగుతున్న చీకటి దందా
- ఇసుక వ్యాపారులకు అండగా అధికారులు
- ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి



తాడ్‌బిలోలి మీదుగా నిర్మల్‌కు తరలుతున్న ఇసుక టిప్పర్‌

రెంజల్‌(బోధన్‌): అధికారుల అండ బలం, రాజకీయ నాయకుల సహకారంతో రెంజల్‌ మండలంలో ఇసుకాసురులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులకు ఇవ్వాల్సింది ఇస్తే తమకు అడ్డురారనే ధోరణితో ఇసుక బకాసురులు నిత్యం వారి చేతులు తడుపుతుండడంతో అధికారులు సైతం ఇసుక తవ్వుకో.. అమ్ముకో అనే విధంగా వ్యవహరిస్తున్నారు. వాల్టాకు తూట్లు పొడుస్తున్న వీరి వ్యాపారం మూడు టిప్పర్లు, ఆరు ట్రిప్పులుగా మారింది. రెవెన్యూ, పోలీసు, మైనింగ్‌శాఖల అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంతో వీరి ఆదుపునకు అంతులేకుండా పోతోంది. రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు ఇసుక టిప్పర్లు చక్కర్లు కొడుతూనే ఉంటాయి. సాక్షాత్తు పోలీస్‌స్టేషన్‌, తహసీల్‌ కార్యాలయాల ముందు నుంచే టిప్పర్లు వెళ్తున్నా సంబంధిత అధికారులు ఇదేంటని స్పందించక పోవడం చూస్తుంటే వీరికి రావాల్సిన మాముళ్లు అందుతున్నాయనే అనుమానం కలుగుతోంది. మండలంలోని కందకుర్తి, నీలా, పేపర్‌మిల్‌ గ్రామాల నుంచి నిత్యం రాత్రి సమయంలో తాడ్‌బిలోలి, బోర్గాం గ్రామాల మీదుగా నిర్మల్‌, ఆదిలాబాద్‌ జిల్లాలకు, రెంజల్‌ నుంచి ఎడపల్లి మండలం సాటాపూర్‌గేట్‌, నవీపేట్‌ మండలాల మీదుగా నిజామాబాద్‌కు ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

ఖాళీ అవుతున్న నిల్వలు

మండలంలోని కందకుర్తి, నీలా, పేపర్‌మిల్‌ గ్రామాల్లోని ఇసుక అక్రమ నిల్వలు ఖాళీ అవుతున్నాయి. గత వేసవిలో గోదావరి, మంజీరా నదులతో పాటు పెద్దవాగు నుంచి ఇసుకను తోడేస్తూ గుట్టలు, గుట్టలుగా అక్రమార్కులు నిల్వ చేసి పెట్టుకున్నారు. వర్షాకాలంలో మార్కెట్‌లో ఇసుకకు డిమాండ్‌ ఉంటుండడంతో రాత్రి సమయంలో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. సంబంధిత అధికారులకు ఇసుక భారీ నిల్వలు దర్శనమిచ్చినా పట్టించుకోవడం లేదు. ఇసుక మాఫియా వద్ద అందినకాడికి దండుకుంటూ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగానే గండిపడుతోంది. స్థానిక జెడ్పీటీసీ మేక విజయ స్వయంగా ఇసుక అక్రమ రవాణాను నియంత్రించాలని అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంపై అధికారులపై ఉన్న ఒత్తిడి ఎంటో స్పష్టమౌతుంది. పలువురు పోలీసులు అందినకాడికి దండుకుని టిప్పర్లకు లైన్‌ క్లియర్‌ చేస్తున్నట్లు సమాచారం. ఈ ఇసుక అక్రమ రవాణాలో ఆయా గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు కీలకంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

20లోగా పరీక్ష ఫీజు చెల్లించాలి

నిజామాబాద్‌అర్బన్‌: ఓపెన్‌ పదో తరగతి, ఇంటర్‌ పరీక్షల ఫీజును అపరాధ రుసుంతో ఈ నెల 20 వరకు చెల్లించవచ్చని డీఈవో దుర్గాప్రసాద్‌ ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్‌లో జరగబోయే పరీక్షలకు సంబంధించి తాత్కాలిక ఫీజును అపరాధ రుసుముతో చెల్లించవచ్చన్నారు. పదో తరగతి వారు సబ్జెక్టుకు రూ.వంద అపరాధ రుసుముతో, ఇంటర్‌ అభ్యర్థులకు సబ్జెక్టుకు రూ.150, తాత్కాల్‌ ఫీజు రూ.వెయ్యి చెల్లించాలని వివరించారు.

13న నృత్యోత్సవ్‌



నిజామాబాద్‌ సిటీ: నిజామాబాద్‌ నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో ఈ నెలా 13న డ్యాన్స్‌ అసోసియేషన్‌, తెలంగాణా భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నృత్యోత్సవ్‌-2023 నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్‌ అధ్యక్షుడు తోగటి ఆనంద్‌ బాబు తెలిపారు. సోమవారం స్థానిక వినాయక్‌నగర్‌ డ్యాన్స్‌ అకాడమీలో ఆయన మాట్లాడారు. జిల్లాస్థాయి సాంస్కృతిక కార్యక్రమంలో పాఠశాలల విద్యార్థులు, డ్యాన్స్‌ అకాడమీ విద్యార్థులతో బృందాల వారీగా నృత్య ప్రదర్శన ఉంటుందని వివరించారు. ఇందులో జానపదం, పేరిణి, కూచిపూడి, భరతనాట్యం, దేశభక్తి, సినీపాటలపై ప్రదర్శనలు ఉంటాయన్నారు. సమావేశంలో డ్యాన్స్‌ అకాడమి కార్యదర్శి తోట సతీష్‌, పసునూరి వినయ్‌ కుమార్‌, తోట ప్రశాంత్‌, నవనీత, సిద్దార్థ్‌, ఆదిత్య, బాబి, అమృత, గీతాంజలి, రాము, సాయితేజ పాల్గొన్నారు.

వినాయకుడి ఆకారంలో బొప్పాయి



డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): డొంకేశ్వర్‌ మండలం నూత్‌పల్లిలో బొప్పాయి వినాయకుడి రూపంలో కాసింది. మంగ్లారం గంగాధర్‌ అనే రైతు పెరట్లో కాసిన బొప్పాయి గణపతి ఆకారంలో ఉంది. సోమవారం దానిని దేవుడి ఫొటోల వద్ద ఉంచి పూజలు చేశారు.

డ్రగ్స్‌ నియంత్రణపై అవగాహన



ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని నాగారం మైనారిటీ గురుకుల కాలేజీలో ఎక్సైజ్‌ శాఖ, జేసీఐ ఇందూర్‌ ఆధ్వర్యంలో సోమవారం డ్రగ్స్‌ నియంత్రణపై అవగాహన కల్పించారు. ఎక్సైజ్‌ ఎస్‌హెచ్‌వో దిలీప్‌ మాట్లాడుతూ విద్యార్థులు మత్తుపదార్థలకు దూరంగా ఉండాలన్నారు. నయన్‌, మహమ్మద్‌ అబ్దుల్‌ బషీర్‌, విజయానంద్‌, ఇలియాస్‌, మౌలానా పాల్గొన్నారు.

పరిహారం ఇప్పించాలని వినతి



ఏఈవోకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కమ్మర్‌పల్లి: పంట వేసి మూడు నెలలు అవుతున్నా సోయాబీన్‌ పంటకు కాత లేదని, విత్తనాలు విక్రయించిన వ్యక్తి నుంచి పరిహారం ఇప్పించాలని మండలంలోని హాసాకొత్తూర్‌ రైతులు సోమవారం ఏఈవో రవిని కోరారు. వర్షాకాల ప్రారంభంలో గ్రామానికి చెందిన పుట్కం గంగాధర్‌ నుంచి రూ.3500 నుంచి రూ.3700 వరకు చెల్లించి 26 కిలోల బరువు గల విత్తనాల బస్తాలను 86 మంది రైతులం కొనుగోలు చేశామన్నారు. పంట వేసి మూడు నెలలు అవుతున్నా పంటకు పూత, కాత లేదని వివరించారు. ఈ విషయమై డీలర్‌ను నిలదీస్తే సమాధానం చెప్పక పోవడంతో పాటు, ఏమీ చేసుకుంటాలో చేసుకోండని దబాయించాడన్నారు. విత్తనాల కొనుగోలు సమయంలో కొనుగోలు బిల్లు రశీదు అడిగితే మహారాష్ట్ర కంపెనీకి చెందిన బిల్లు ఇచ్చాడని తెలిపారు. ఒక్కో ఎకరానికి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని చెప్పి విత్తనాలను విక్రయించారని రైతులు పేర్కొన్నారు. సదరు వ్యక్తి నుంచి ఎకరానికి 12 క్వింటాళ్ల దిగుబడి చొప్పున పరిహారం ఇప్పించాలని ఏఈవోను కోరారు. ఈమేరకు వినతిపత్రం అందజేశారు. రైతులు గడ్డం రాజేశ్వర్‌, నలిమెల గంగారెడ్డి, సురకంటి రాజేందర్‌, లక్మ శ్రీనివాస్‌, లక్మ భాస్కర్‌, బక్కూరి గోపి, తెడ్డు రాజేశ్వర్‌ పాల్గొన్నారు.

కేంద్ర అధికారుల పర్యటన



పిప్రి గ్రామంలో కిరాణ దుకాణాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు



అక్బర్‌నగర్‌లో మహిళలతో సమావేశమైన అధికారులు

భీమ్‌గల్‌: భారత్‌ దర్శన్‌ కార్యక్రమంలో భాగంగా సెంట్రల్‌ సెక్రెటరి విభాగానికి చెందిన అసిస్టెంట్‌ సెక్షన్‌ ట్రెయినీ అధికారులు సోమవారం పిప్రి గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని మహిళా సంఘాల సభ్యులతో సమావేశమై, కార్యక్రమాలను పరిశీలించారు. మహిళా సంఘాల నిర్వాహణ గురించి తెలుసుకున్నారు. మహిళా సంఘాల ద్వారా లోన్‌ తీసుకొని దుస్తుల షాపు, కిరాణా దుకాణాలు నిర్వహిస్తున్న వారిని కలిసి ఆర్థిక అభివృద్ధి గురించి తెలుసుకున్నారు. అధికారులు వైశాలి షేకావత్‌, అవంతిక ప్రతీక చాహర్‌, శివం కుమార్‌, కూనత్‌, ఏపీఎం కుంట శ్రీనివాస్‌, ఏపీవో నర్సయ్య, సర్పంచ్‌ ప్రవీణ్‌, ఐకేపీ సీసీ రఘుపతి పాల్గొన్నారు.

రుద్రూర్‌: మండలంలోని అక్బర్‌నగర్‌లో పర్యటిస్తున్న కేంద్ర బృందం సభ్యులు సోమవారం ప్రాథమిక పాఠశాల, అంగన్‌ వాడీ కేంద్రాలను సందర్శించారు. విద్యార్థుల వివరాలు, విద్యాబోధన, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఇస్తున్న పౌష్టికాహారం గురించి తెలుసుకున్నారు. మహిళా సంఘ సభ్యుల సమావేశానికి హాజరయ్యారు. ఎంపీడీవో బాల గంగాధర్‌, ఏపీఎం భాస్కర్‌, ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ శ్రీలత, జీపీ కార్యదర్శి గంగారాం ఉన్నారు.

ప్రజావాణికి 81 ఫిర్యాదులు



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న పేరెంట్స్‌ కమిటీ ప్రతినిధులు



కలెక్టరేట్‌కు తరలివచ్చిన కొల్‌పూర్‌ గ్రామస్తులు

సుభాష్‌నగర్‌: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 81 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్‌ పి యాదిరెడ్డి, డీఆర్డీవో చందర్‌, డీపీవో జయసుధ, ఆర్డీఓ రాజేంద్రకుమార్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

వెల్మల్‌, నందిపేట్‌, చింరాజ్‌పల్లి శివారులో కొల్‌పూర్‌కు చెందిన ఎస్సీ, ఎస్టీ కుటుంబాల భూమిని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. 1955-56 నుంచి 30 ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు ఆ భూమిలో కబ్జాలో ఉన్నాయని, వారికి 1995లో పట్టాలు ఇచ్చారన్నారు. తిరిగి 2009లో కొత్త పట్టాలు ఇచ్చారని తెలిపారు. ఆంధ్రనగర్‌ పరిధిలోని ఇంద్రనగర్‌ కాలనీకి చెందిన ఇద్దరు ఏడెకరాల భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నారని, ఆ భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని, వారి పట్టాపాస్‌ పుస్తకాలను రద్దు చేయాలని కోరారు.

సొంత భవనాన్ని నిర్మించాలని..

వేల్పూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలకు నూతన భవనాన్ని నిర్మించాలని పేరెంట్స్‌ కమిటీ ప్రతినిధులు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 2016లో పాఠశాలను మంజూరు చేసినా.. నేటికీ వేల్పూర్‌లో సొంత భవనం లేదన్నారు. ఆర్మూర్‌ శివారులో ఉన్న పాత రేకుల షెడ్‌లో పాఠశాలను కొనసాగిస్తున్నారని, ఒకే గదిలో తినడం, పడుకోవడం, తరగతి గదులు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. వర్షాకాలంలో కూర్చోడానికి స్థలం లేదన్నారు. ప్రభుత్వం కేటాయించిన భూమిలో భవన నిర్మాణం చేపట్టాలని, విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

శ్మశానవాటికను పరిరక్షించాలని..

నగరంలోని అర్సాపల్లిలో శ్మశానవాటిక స్థలాన్ని పరిరక్షించాలని గ్రామస్తులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. శ్మశానవాటిక స్థలాన్ని ఆక్రమించుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

పోడు భూముల పట్టాల కోసం..

భీమ్‌గల్‌ మండలంలోని రహత్‌నగర్‌తోపాటు చాలా తండాల్లో గిరిజనులు పోడు పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నారని, వెంటనే పట్టాలు ఇవ్వాలని ప్రజాపంథా రాష్ట్ర నాయకులు ప్రభాకర్‌ డిమాండ్‌చేశారు. ఈమేరకు ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. నరేందర్‌, బాబులాల్‌, సేవాలాల్‌, లావణ్య, లక్ష్మి, సుగుణ, లత, అనిత, రాజేందర్‌ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



బోధన్‌టౌన్‌: జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ట్రాఫిక్‌ ఏసీపీ నారాయణసింగ్‌ అన్నారు. సోమవారం పట్టణంలోని జూనియర్‌ కళాశాలలో ట్రాఫిక్‌ నియంత్రణపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం పట్టణంలోని రైల్వే గేట్‌ వద్ద ఏర్పాటు చేసిన బోలార్డ్స్‌ను పరిశీలించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు తరచూ జరుగుతున్న ప్రాంతాలను గుర్తించామని ఆ ప్రాంతాల్లో బోలార్డ్స్‌ ఏర్పాటు చేస్తున్నామన్నారు. పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్‌ ఉన్నారు.

మట్కా ఆడుతున్న ఒకరి అరెస్టు

ఖలీల్‌వాడి: మట్కా ఆడుతున్న నగరంలోని కోటగల్లికి చెందిన సత్యంను టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. ఆయన నుంచి రూ.8,500 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్‌కుమార్‌ తెలిపారు.

ఆ డబ్బులను మంత్రే ఆపేయించారు

- హత్యాకేసు నిందితుడికి కొమ్ము కాస్తున్న ప్రశాంత్‌ రెడ్డి
- కాంగ్రెస్‌ నాయకుడు ముత్యాల సునీల్‌ రెడ్డి ఆరోపణ



మంత్రి ర్యాలీలో నిందితుడు ఉన్న చిత్రాన్ని చూపిస్తున్న సునీల్‌రెడ్డి

కమ్మర్‌పల్లి: నిజామాబాద్‌ జిల్లా కమ్మర్‌పల్లి మండలం హాసకొత్తూర్‌లో రెండేళ్ల క్రితం హత్యకు గురైన మాలవత్‌ సిద్ధార్థ్‌ కుటుంబ సభ్యులకు ఎస్సీ కార్పొరేషన్‌ నుంచి రావలసిన డబ్బులను మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆపేశారని కాంగ్రెస్‌ నేత ముత్యాల సునీల్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం మోర్తాడ్‌లోని సునీల్‌రెడ్డి నిలయంలో సునీల్‌రెడ్డిని సిద్ధార్థ్‌ కుటుంబ సభ్యులు కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. ఈ సందర్భంగా సునీల్‌రెడ్డి మాట్లాడుతూ సిద్ధార్థ్‌ తండ్రి అనారోగ్యం బారిన పడితే సీఎం రిలీఫ్‌ ఫండ్‌ కోసం దరఖాస్తు చేసుకుంటే మంత్రి ఆగ్రహంతో చింపేశారని అన్నారు. హత్య కేసులో నిందితుడిగా ఉన్న రాజేశ్‌ను పార్టీ నుంచి సస్పెండ్‌ చేశామని చెప్పి, మంత్రి నిర్వహించే ర్యాలీలో తన వెంట తిప్పుకుంటున్నాడని వ్యాఖ్యానించారు. నిందితుడిపై పెట్టిన కేసులో కాల్‌ డేటాపై ఇప్పటికీ స్పష్టత లేదని అన్నారు. మంత్రి బాధిత కుటుంబానికి తక్షణం న్యాయం చేయాలని సునీల్‌ రెడ్డి డిమాండ్‌ చేశారు.

చెట్టును ఢీకొన్న బస్సు

కామారెడ్డి క్రైం: కామారెడ్డి నుంచి పెద్దమల్లారెడ్డి వెళ్తున్న ఆర్టీసీ బస్సు జిల్లా కేంద్రానికి సమీపంలోని క్యాసంపల్లి వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఐదుగురు ప్రయాణికులతో పాటు కండక్టర్‌కు గాయాలయ్యాయి. గాయపడిన వారిని వెంటనే కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో దోమకొండకు చెందిన చంద్రకళ, పెద్దమల్లారెడ్డికి చెందిన వాసవి, ముత్యంపేట గ్రామానికి చెందిన లక్ష్మీ, సంగమేశ్వర్‌కు చెందిన శారద, ధర్మరావుపేటకు చెందిన అనసూయ, కండక్టర్‌ ప్రసన్న ఉన్నారు. దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. డ్రైవర్‌ అజాగ్రత్త కారణంగానే ప్రమాదం జరిగిందని ప్రయాణికులు చెబుతున్నారు. గాయపడిన ప్రయాణికురాలు చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

మట్టి గణపతి.. పర్యావరణ హితం













పాస్టర్‌ ఆఫ్‌ పారిస్‌తో తయారు చేసిన గణనాథుల ప్రతిమలతో కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన పెరిగింది. దీంతో చాలా మంది మట్టి గణపతి ప్రతిమలను ప్రతిష్ఠించి పూజిస్తున్నారు. ఈ ఏడాది కూడా వినాయక చవితికి గణేశుడి విగ్రహాలు సిద్ధమయ్యాయి. జిల్లాలో కలకత్తా కళాకారులు మట్టితో వివిధ రూపాల్లో ప్రతిమలను తయారు చేస్తున్నారు. నగరంలోని పాంగ్రా, కంఠేశ్వర్‌ బైపాస్‌ రోడ్డులో ప్రతి ఏటా వినాయక చవితికి ఐదు నెలలకు ముందుగానే వచ్చి విగ్రహాల తయారీ మొదలు పెడుతున్నారు.

– సాక్షి స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌, నిజామాబాద్‌

15న జిల్లాస్థాయి ఉపన్యాస పోటీలు

నిజామాబాద్‌నాగారం: నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 15న జిల్లాస్థాయి ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన అధికారి శైలి బెల్లాల్‌ తెలిపారు. అక్టోబర్‌ 2న గాంధీ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న పోటీల్లో భాగంగా 15న సుభాష్‌నగర్‌లోని నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 'నేటి ప్రపంచానికి గాంధేయవాద ఆవశ్యకత' అనే అంశంపై మాట్లాడాల్సి ఉంటుందన్నారు. 18 నుంచి 29 ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు. ఉపన్యాసం హిందీ/ఇంగ్లిష్‌లో మాత్రమే ఉండాలన్నారు. పోటీల్లో గెలుపొందిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు సెప్టెంబర్‌ 14 సాయంత్రం 5గంటల లోపు తమ వివరాలను 9100435410 నంబర్‌కు వాట్సాప్‌లో పంపాలని సూచించారు.

క్రైం కార్నర్‌

కట్నం కోసం వేధిస్తున్నారని ఫిర్యాదు

భిక్కనూరు: అదనపు కట్నం కోసం అత్తింటి వారు వేధిస్తున్నారని భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన మహిళ సోమవారం పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. గ్రామానికి చెందిన ప్రవళిక వివాహం 16 నెలల క్రితం కరీంనగర్‌ జిల్లా వీణవంక మండల జంగంపల్లి గ్రామానికి చెందిన జగన్నాథుల సంపత్‌తో జరిగింది. పెళ్లి సమయంలో కట్న కానుకలు అందజేశారు. అయినా రూ.4.5 లక్షలు, రెండు తులాల బంగారం తీసుకు రావాలని బెదిరిస్తున్నారని భర్త సంపత్‌, అత్త మామలు రాజవ్వ, రాజయ్య, మరిది హరీశ్‌పై ఫిర్యాదు చేసింది.

చీటింగ్‌ కేసు నమోదు

మోపాల్‌: మండలంలోని న్యాల్‌కల్‌కు చెందిన రాజ్‌కుమార్‌ను మలేషియాకు పంపిస్తానని మోసం చేయడంతో లింగితండాకు చెందిన సాయిలుపై చీటింగ్‌ కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాము తెలిపారు. రాజ్‌కుమార్‌ను మలేషియా పంపిస్తానని సాయిలు డబ్బులు తీసుకున్నాడు. అక్కడికి వెళ్లాక కంపెనీ వారు వచ్చి తీసుకెళ్తారని చెప్పడంతో రాజ్‌కుమార్‌ మలేషియా ఎయిర్‌పోర్టులో దిగాడు. ఎవరూ రాకపోవడంతో సాయిలుకు ఫోన్‌ చేయగా, తిరిగి భారత్‌కు రావాలని సూచించారు. డబ్బులు ఇవ్వాలని అడగగా, రూ.75వేలు చెల్లిస్తానని ఒప్పంద పత్రం రాసిచ్చాడు. డబ్బులు చెల్లించకపోవడంతో బాధితుడు ఫిర్యాదు చేశారు.

డ్రంకన్‌ డ్రైవ్‌ కేసులో జైలు శిక్ష

మోపాల్‌: మండలంలోని చిన్నాపూర్‌కు చెందిన గోద హన్మాండ్లు మద్యం తాగి వాహనం నడిపినందుకు జడ్జి రెండ్రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై రాము సోమవారం తెలిపారు. మోపాల్‌లో డ్రంకన్‌ డ్రైవ్‌ నిర్వహించగా, హన్మాండ్లు మద్యం తాగి బైక్‌ నడుపుతూ దొరికాడన్నారు.

డబ్బులు ఇవ్వలేదని అమ్మమ్మ హత్య



అక్కవ్వ మృతదేహం

నిజాంసాగర్‌(జుక్కల్‌): మద్యం కోసం డబ్బులు ఇవ్వడం లేదని యువకుడు అమ్మమ్మ వరుసయ్యే వృద్ధురాలిని హతమార్చాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్‌ మండలం తెల్గపూర్‌ గ్రామానికి చెందిన దుంపల అక్కవ్వ (70)కు సంతానం లేదు. అక్కవ్వ తన సొంత అక్క సంగవ్వ కూతురు సాయవ్వ వద్ద ఉంటుంది. కాగా సాయవ్వ కొడుకు బాలపోచయ్య డబ్బుల కోసం అక్కవ్వను తరచూ వేధించేవాడు. ఈ క్రమంలో ఆదివారం సాయవ్వ, అంజయ్య దంపతులు ఊరికి వెళ్లగా బాలపోచయ్య, అక్కవ్వ ఇద్దరు ఇంట్లో ఉన్నారు. అర్ధరాత్రి వేళ తనకు డబ్బులు ఇవ్వాలని బాలపోచయ్య అక్కవ్వతో గొడవపడ్డాడు. డబ్బులు లేవని అక్కవ్వ నిరాకరించింది. దీంతో అక్కసు పెంచుకున్న బాలపోచయ్య మంచంపై నిద్రిస్తున్న అక్కవ్వ గొంతుపై గొడ్డలితో నరికి చంపాడు. వృద్ధురాలి మృతదేహంపై నూలురగ్గు కప్పి ఇంట్లో నిద్రించాడు. ఉదయం 11 గంటల ప్రాంతంలో గ్రామంలోకి వెళ్లిన బాలపోచయ్య మా అమ్మమ్మ మంచంపైన చనిపోయి ఉందని గ్రామ సర్పంచ్‌ నారాయణతో పాటు గ్రామస్తులకు తెలిపాడు. వారు ఇంటికి వెళ్లి చూడగా రక్తపు మడుగులో అక్కవ్వ కనిపించింది. బాలపోచయ్యను నిలదీయగా డబ్బులు అడిగితే ఇవ్వడం లేదన్న కోపంతో గొడ్డలితో నరికి చంపినట్లు తెలిపాడు. సమాచారం మేరకు బాన్సువాడ పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని వివరాలు సేకరించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

చెరువులో పడి ఒకరి మృతి

కామారెడ్డి క్రైం: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరు మృతి చెందిన ఘటన కామారెడ్డి సమీపంలోని అడ్లూరు శివారులో ఉన్న బయ్యని చెరువు వద్ద సోమవారం వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డిలోని రాజీవ్‌ నగర్‌ కాలనీకి చెందిన కెంగర్ల శివశంకర్‌ (45) ఆటో నడిపిస్తూ జీవనం సాగించేవాడు. తన సెల్‌ ఫోన్‌ ఎక్కడో పడిపోయిందని, వెతికి వస్తానని ఇంట్లో చెప్పి ఈనెల 9న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని మృతదేహం చెరువులో తేలడంతో సోమవారం దేవునిపల్లి పోలీసులు విచారణ జరిపారు. మృతుడిని శివశంకర్‌గా గుర్తించారు. కాలకృత్యాలకు వెళ్లి చెరువులో జారిపడి మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుడి భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

భిక్కనూరులో బైక్‌ చోరీ

భిక్కనూరు: భిక్కనూరుకు చెందిన ఊరే సిద్దరాములు బైక్‌ ఆదివారం అర్ధరాత్రి చోరీకి గురైనట్లు ఎస్సై సాయికుమార్‌ తెలిపారు. సిద్దరాములు తన బైక్‌ను ఆదివారం రాత్రి ఇంటి ముందట పార్క్‌ చేశాడు. సోమవారం వేకువ జామున లేచి చూసే సరికి బైక్‌ కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పేకాటస్థావరంపై దాడి

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ మండలం ఫత్తేపూర్‌లో పేకాడుతున్న ఎనిమిది మందిని టాస్క్‌ఫోర్స్‌ సీఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో దాడి చేసి పట్టుకున్నారు. వారి నుంచి రూ.26,900 నగదు, 8 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. పేకాడుతున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగాధర్‌ పేర్కొన్నారు.

యువకుడి అదృశ్యం

మోపాల్‌: మండలంలోని న్యాల్‌కల్‌కు చెందిన జిల్లారపు రాజు అదృశ్యమైనట్లు ఎస్సై రాము సోమవారం తెలిపారు. రాజు ఆంధ్రప్రదేశ్‌లోని ఓ సర్వీసింగ్‌ సెంటర్‌లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఇక్కడికి వచ్చిన రాజు వారం రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లాడు. ఫోన్‌ స్విచ్ఛాఫ్‌ రాగా, బంధువులు, చుట్టుపక్కల గ్రామాల్లో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో రాజు తండ్రి హన్మాండ్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.